# రక్షణ

కథ

-రావినూతల సువర్ణాకన్నన్



సాయంత్రం నాలుగ్గంటలయింది. శ్రీవారు అప్పుడే రారని తెలిసినా కాలుకాలిన పిల్లిలా ఇంట్లోకి బయటికి తిరుగుతూనే వున్నాను. అసలు మా మంత్రి మామయ్య కొడుకు అరుణ్ పెళ్లి శుభలేఖ వచ్చిందగ్గర్నించీ నాకు కాలు నిలవడం లేదు. ఉత్సాహం కట్టలు తెంచు కుంది. అది బావకి పెళ్లన్న ఆనందంతో కాదు. అతగాడి అత్తగారెలాంటి వారో అన్న క్యూరియాసిటీతో. అంటే వాళ్లు మా కన్నా పేదవాళ్లయి వుంటారని నా నమ్మకం.

అసలు నేను పుట్టగానే 'అరుణ్ గాడి పెళ్లాం' అంటూ అనౌన్స్ చేసేసిందట మా అమ్మమ్మ. తర్వాత కూడా అందరూ నన్ను అరుణ్ పెళ్లాంగానే చూసేవారు. నేను కూడా 'కామోసు' అనుకున్నాను మొదట్లో. మామూలుగానే వున్నా, మా మామయ్య ఎమ్మెల్యే అయ్యాక మా అత్తయ్యకి మా మీద చిన్నచూపు ఏర్పడింది. అయినా పెత్తనమంతా అమ్మమ్మదే కనుక మా పెళ్లి జరిగి తీరుతుందని అనుకున్నారంతా.

నాకు పెళ్లీడు వచ్చేసరికి మా మామయ్య మంత్రయిపోయాడు. ఓ సందర్భంలో అంతా కలుసుకున్నాము. లాంఛనంగా మా నాన్న పెళ్లిని గురించి అడిగేశాడు. మామయ్య బుర్రగోక్కుంటూ, బావమీదకి తోసేశాడు. బావ ఏదో అనేంతలో, అమ్మమ్మ అందుకొని, "అందం కొరుక్కుతింటామా? మనసు ముఖ్యంరా' అంది బావకేసి చూస్తూ.

"అవును! మనసు బంగారం! పిల్ల రాక్షసి!" గొణిగింది అత్తయ్య. అది నాకు మాత్రమే వినిపించింది. అమ్మమ్మ మళ్లీ రెట్టించేసరికి–

"అందచందాల మాట వదిలెయ్యండి. వాడు మెడిసిన్ చేశాడు. ఇది టెన్త్‌క్లాస్ మూడుసార్లు తప్పి కూర్చుంది. ఇద్దరికీ ఎలా కుదురుతుంది?" కాస్త గట్టిగానే అంది అత్తయ్య.

"చదువెందుకే? ఇదేమైనా ఉద్యోగం చెయ్యాలా? వూళ్లేలాలా? మొగుడికి ఉత్తరం రాసే పాటి చదువు వుండనే వుంది!" అంటూ పాత డైలాగే కొట్టేసింది అమ్మమ్మ. ఆవిడకి పిచ్చికోపం వచ్చింది. కోపంగా బావకేసి చూసింది. కానీ అతగాడు అక్కడుంటేగా? ఎప్పుడో జారుకున్నాడు.

మా అందరికీ విషయం అర్థమైపోయింది. పెద్దలంతా ఘర్షణ పడ్డారు. నాన్నకి మరింత కోపం వచ్చి క్షణాల మీద సంబంధం చూసి అంతరంగ వైభవంగా మా పెళ్లి చేసేశాడు. మామయ్యకి శుభలేఖ కూడా వెయ్యలేదు. తర్వాత కొన్నాళ్లు బద్ధశత్రువుల్లా వున్నా, మా అమ్మమ్మకి సుస్తీ చెయ్యడంతో మళ్లీ కలిసిపోయారు కానీ, పెళ్లయ్యాక నన్ను చూడ్డానికి మామయ్యా వాళ్లెవరూ రాలేదు. ఇన్నాళ్లకి బావపెళ్లి శుభలేఖ, లెటరు వచ్చాయి. పెళ్లికెళ్లి నా స్థితిగతులు వాళ్లకి చూపించాలన్న ఆరాటం ఎక్కువైంది. ముందు మావారు రానన్నారు. కానీ నేను పట్టుపట్టడంతో పెళ్లికి వెళ్లి వెంటనే వచ్చేద్దాం అనడంతో అయిష్టంగానే ఒప్పుకున్నారు. నా ఆనందానికి హద్దుల్లేవు. మనసులో మాత్రం..

అరుణ్ పెళ్లాం రాక్షసైతే బావుండు! పేదింటి పిల్లయితే మరీ మంచిది. పెళ్లి తూతూ మంత్రంలా జరిపిస్తే అత్తయ్య మొహం ఎలా వుంటుందో చూడాలని మహా కోరికగా వుంది.

ఆ రాత్రి నా కంటి మీద కునుకే లేదు. మర్నాడే ప్రయాణం మరి! అంత క్రితం రోజే పట్టుచీరలూ, ఆయనగారి సూట్లూ సూట్‌కేస్ నిండా సర్దేశాను. "ఒక్కరోజుకి అన్నెందుకు?" అని ఆయనగారు వారిస్తున్నా వినకుండా.

పూర్తిగా తెల్లవారకుండానే లేచి గీజర్ ఆన్ చేశాను. ఆయన ఆఫీసుకెళ్తూ...

"సాయంత్రం నాలుగింటికల్లా ఆటోతో సహా వస్తాను. నువ్వు రెడీగా వుండు" అన్నారు క్లుప్తంగా. నేను పదే పదే 'మా బావ మా బావ' అనడం ఆయనకి నచ్చినట్లు లేదు. 'ఇంక మీ బావగోల ఆపు!' అని విసుక్కుంటే నోరుకట్టేసుకున్నాను కూడా. మేం వుంటున్నది భద్రాచలం దగ్గర ఓ అడవిలాంటి ప్రదేశంలో. ఎక్కడికెళ్లాన్నా భద్రాచలం వెళ్లి వెళ్లాల్సిందే.అక్కడికి వెళ్లాలంటే మూడుకిలోమీటర్లు నడవాలి. అందుకే ఆయన ఆటోతో వస్తానన్నది. ఆయన వెళ్లగానే లోపలికొచ్చి ఇనప్పెట్టెలోంచి నగలన్నీ తీశాను. నాకు చిన్నతనం నుంచి నగలంటే చాలా ఇష్టం. అందులోనూ వెళ్లేది మినిష్టర్ మామయ్య ఇంట్లో జరిగే పెళ్లికి. దర్జాగా వెళ్లాలి కదా.

క్షణాలు లెక్కబెట్టుకుంటూ మూడింటికల్లా స్నానం చేసి, జానెడు వెడల్పు జరీ అంచున్న పట్టు చీర కట్టుకున్నాను. కాసుల పేరూ, చంద్రహారం, పదిహేనుజతల బంగారు గాజులు, మధ్య మధ్య రాళ్ల గాజులు వేసుకున్నాను. బెత్తెడు జడకి సవరం తగిలించి మెడ నరాలు పొంగేంత గట్టిగా జడవేసుకొని, బారెడు జడకి పిల్లకుప్పెలు తగిలించాను. తల్లో అంతకుముందే సిద్ధం చేసుకున్న ఆరుమూరల కదంబమాల తురుముకున్నాను. చెంపస్వరాలు కనిపించేలా జుట్టు సవరించుకున్నాను. మువ్వల వడ్డాణం పెట్టుకొని, ఎర్రరాళ్ల అడ్డగని, చీర అంచు కప్పెయ్యకుండా జాగ్రత్త పడ్డాను. చేతులకున్న అరవంకీలు మిలమిల మెరుస్తూంటే మురిపెంగా అద్దంలో చూసుకున్నాను.

"అబ్బ! నాకు నేనే ముద్దొస్తున్నాను. ఇంక ఆయన చూస్తేనా?" అనుకుని మురిసిపోయాను. ఇంతలో ఆటోతో సహా ఆయన రానే వచ్చేశారు. తలుపు తీసి సినిమాలో హీరోయిన్‌లా ఓ మంచి ఫోజుపెట్టాను. ఆయన కొయ్యబారిపోయి తేరుకొని,

"ఏవిటీ గంగిరెద్దు వేషం?" అన్నారు చిరాగ్గా.

"ఏవిటీ.... ఇంత చక్కగా అలంకరించుకుంటే లక్ష్మీదేవిలా వున్నావని మెచ్చుకుంటారనుకుంటే!" అన్నాను నిష్టూరంగా.

ఆయన వినిపించుకోలేదు. నగలన్నీ తీసెయ్యమని గొడవ చేశారు. తియ్యనని నేనూ అరిచాను. ఇద్దరం ఘర్షణ పడుతుంటే ఆటోవాలా వేడుక చూస్తున్నాడు. ఇంక వాదించి లాభం లేదనుకున్న శ్రీవారు, నేను అందించిన సూట్ నేలకేసి విసిరికొట్టి, సూట్‌కేస్‌తో సహా బయటకి నడుస్తూ..

"ఎలాగో తగలడు" అన్నారు కసిగా.

నేను విజయగర్వంతో తలుపు లాక్ చేసి ఆటోలో కూర్చున్నాను. ఆటో అతను కూడా విస్మయంగా చూస్తూంటే నవ్వుకున్నాను. అవును మరి ఇన్ని నగలు అతనెక్కడ చూసుంటాడు?

మేం భద్రాచలం బస్టాండుకి చేరేసరికి పొద్దుపోయింది. అసలే పెళ్లిళ్ల సీజను. జనం కిటకిటలాడిపోతున్నారు. ఆరుగంటలు దాటుతుండగా ఓ డొక్కు బస్సులో సీట్లు సంపాయించి తేలిగ్గా వూపిరి తీసుకున్నాం. బస్సు బయల్దేరింది. అందరూ నా నగలకేసి ఆబగా చూస్తుంటే పైట కొంగు భుజాల నిండుగా కప్పుకున్నా.

డబడబలాడుతూ వెళుతున్న బస్సు సడెన్‌గా ఆగిపోయి ఇక కదలనని మొరాయించింది. రెండు మూడు గంటలు దాంతో కుస్తీ పట్టిన బస్సు సిబ్బంది ఇక ఇది కదలదు అన్న చావు కబురు చల్లగా చెప్పేశారు. నా గుండె ఆగినంత పనైంది. మిగతా ప్రయాణీకులంతా బస్సుని తిట్టుకుంటూ దారిన పోతున్న బస్సుల్లో, లారీల్లో ఆపి వెళ్లిపోయారు. మేమూ అలా వెళ్లాలనుకునేసరికి ఒక్క వెహికులూ రాలేదు. నా గుండె వేగంగా కొట్టుకుంది. ఓసారి బయటకి చూశాను.

చిక్కటి అడవి, అమావాస్య చీకటి, చెవులు చిల్లులు పడేలా కీచురాళ్ల ధ్వని! వెన్నులోంచి ఒణుకు మొదలయింది. ఓసారి నగలకేసి చూసుకున్నాను. అవి చీకట్లో కూడా ధగధగమెరుస్తున్నాయి.

"మీరెళ్లి వెనక సీట్లో పడుకొండయ్యా! తెల్లరాక ఏదో ఓ బస్సులో వెళ్లొచ్చు" అన్నాడు డ్రైవరు నా నగలకేసి అదోలా చూస్తూ. అదేమాట కండక్టరూ, క్లీనరూ కూడా అన్నారు. నా భయం మరింత పెరిగిపోయింది. నేను నిద్రపోతే నా నెత్తిన్నాలుక్కొట్టి, నగలన్నీ దోచేద్దామన్న వాళ్ల ప్లాన్ నా కర్థమయింది. మా వారితో చెప్పాలంటే ఆయన గుర్రుగా చూస్తున్నారే తప్ప ధైర్యం చెప్పే మూడ్‌లో లేరు. ఇంతలో ఏదో లైటు కనిపించి గభాల్న లేచారు శ్రీవారు.

"అది నాగులుగాడి లారీ బాబూ! వాడుట్టి దగుల్బాజీ వెధవ. వాడి దగ్గర పెద్ద కత్తి కూడా వుంటుంది. ఈ సమయంలో ఆడవాళ్లతో ఆ లారీలో వెళ్లడం చాలా ప్రమాదం" అన్నాడు డ్రైవర్ కంగారుగా. అయినా మేం వినిపించుకోలేదు. వెళ్లి లారీ ఆపాం.

"ఎక్కడికి?" అన్నాడు లారీడ్రైవరు, బీడీ ముక్క ముట్టిస్తూ. ఆ చిరువెలుగులోనే అతన్ని చూసి తుళ్లిపడ్డాం. తెలుగు సినిమా విలన్‌లా భయంకరంగా వున్నాడు. మాట కూడా కరుగ్గా వుంది. దానికి తోడు నాటుసారా కంపు.

"ఖమ్మం" గొణిగినట్లు అన్నారు శ్రీవారు.

"ఇద్దరికీ కలిపి వందవుద్ది" కొట్టినట్లే అన్నాడతను. మాట్లాడకుండా ఎక్కేశాం. డ్రైవర్ పక్కన ఆయన, ఆయన పక్కన నేనూ కూర్చున్నాం. ఎలాగో కొంప చేరితే చాలనట్లు. యాక్సిలేటర్ మీద కాలేస్తూ నన్ను అదోలా చూశాడు. ఆ చూపుకి నా వెన్నులోంచి ఒణుకు బయల్దేరింది. పెదవులు తడారిపోయాయి.

లారీ చప్పుడు చేస్తూ వెళుతోంది.

"నా పేరు నాగులు. కత్తుల నాగులంటారంతా. నీ పేరేంటి గురూ?" అన్నాడతను నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ. మనస్సులో తిట్టుకుంటూనే చెప్పి, నాకేసి నిప్పులు చెరుగుతున్నట్లు చూశారు

శ్రీవారు. ఇంత టెన్షనూ నా నగల మూలానే అని నాకూ తెలుసు. అయినా ఇలా జరుగుతుందని కల కన్నానా? తెలిస్తే, నేనూ ఏ కత్తో, కారమో వెంట తెచ్చుకునేదాన్ని.

"ఓ సిగరెట్టుంటే ఇయ్ గురూ!" అన్నాడు నాగులు ఆర్డర్ వేసినట్లు. మనసులో మండిపడుతూనే అతనికి ఓ సిగరెట్టు ఇచ్చారాయన. సిగరెట్ వెలిగించి, విలాసంగా పొగ వదుల్తూ ఏదేదో మాట్లాడేస్తున్నాడు నాగులు. రాని క్లీనర్‌ని బండ బూతులు తిట్టాడు. 'ఎదవ సెవట' అంటూ షర్ట్ విప్పేశాడు. మరికాస్సేపటికి రోడ్డు మీంచి పక్కకి మళ్లించాడు లారీని. మా పై ప్రాణాలు పైనే పోయినట్టయింది.

"ఇటెక్కడికి?" అన్నారు శ్రీవారు కాస్త గంభీరంగా.

"కాస్త చాయ్ తాగిపోదాం రా గురూ!" అంటూ ఆయన వద్దన్నా వినకుండా బలవంతంగా లారీ దించాడు. ఓ పక్కగా వున్న పాకకేసి అడుగులు వేసి, మళ్లీ వెనక్కి వచ్చి, "నువ్ కూడా రా" అన్నాడు నాకేసి పరిశీలనగా చూస్తూ.

నేను కొయ్యబారిపోయాను. నోట మాట రావడం లేదు. వద్దన్నట్లు తలూపాను. నా కంగారుకి నవ్వుకుంటూ, పాక దగ్గరికెళ్లాడు శ్రీవారితో కలిసి. మళ్లీ ఏమనుకున్నాడో ఏమో ఓ గ్లాసుతో టీ తెచ్చి....

"పర్లేదు తాగు!" అంటూ కొంటెగా నవ్వాడు. నేను కంగారుగా గ్లాసందుకొని చల్లారిపోయిన టీ గడగడా తాగేశాను. అతను వెళ్లలేదు.

"మందేవూరు?" అన్నాడు ఓరగా చూస్తూ. నాలో ఒణుకు పెరిగిపోయింది. కంగారుగా శ్రీవారి కోసం చూశాను.

"మన్దే వూరంటే మాట్లాడవేంటి? ఊc.... ఏ వూరైతే ఏట్లే. ఓ పాలి మా వూరొస్తావా?" అన్నాడు అల్లరిగా. నేను కోపంగా ఏదో అనబోతుండగా, ఎవరో పిలవడంతో వెళ్లిపోయాడు. మరికాస్సేపటికి మా వారు వచ్చేశారు. 'బతుకు జీవుడా' అన్నట్లు వూపిరి తీసుకున్నాను. టీ స్టాలు కుర్రాడు కాబోలు ఖాళీ గ్లాసు తీసికెళ్లిపోయాడు. మరికాస్సేపటికి నాగులు వచ్చాడు షర్టు లేకపోవడంతో బొడ్లో దాచుకున్న కత్తి పాకలోని చిరువెలుగులో స్పష్టంగా కనిపించింది. మా పనైపోయిందనుకున్నాం. పెనం మీంచి లేచి పొయ్యిలో పడ్డాం అనిపించింది. ఏం చేస్తాం? భారం భగవంతుని మీద వేసి కూర్చున్నాం. లారీ మళ్లీ బయల్దేరింది. నాగులు తాగింది టీ కాదనీ, నాటుసారా అనీ, అతన్నించి వచ్చే వాసన చెపుతోంది. మా మొహాలు పాలిపోయాయి. నాగులు చూపులూ, మాటలూ, నవ్వులూ, కాళరాత్రిని గుర్తుచేస్తున్నాయి.

కొంతసేపు తర్వాత హటాత్తుగా మా మొహాల్లోకి వెలుగొచ్చేసింది. కారణం గమ్యం చేరిపోయాం. తెలతెలవారుతుండడంతో జనం సంచారం కూడా మొదలయింది. ఓ పక్కగా లారీ ఆపి, షర్టు వేసుకుంటూ...

"దిగండి" అన్నాడు నాగులు ఎప్పటిలాగానే. అయితే ఈసారి అతని గొంతు గానీ, అతని రూపం గానీ మమ్మల్ని భయపెట్టలేదు, సరికదా ఓ దేవవతామూర్తిలా అనిపించాడు. నిజం! మనిషి రూపం ఎలా వుంటేయేం? మనసు మంచిది! అనుకున్నాను. శ్రీవారు కూడా అదే అనుకొని వుంటారు. అందుకే అదనంగా మరో వంద ఇచ్చారు.

"ఇదెందుగ్గురూ!" డబ్బు అందుకుంటూనే అన్నాడు నాగులు.

"నీ మంచితనానికి"అన్నారాయన నవ్వుతూ ఈసారి అతని పిలుపు ఆయన్ని బాధించినట్లు లేదు. అతను తెల్లబోయి చూస్తుంటే..

"అవున్నాగులూ! అర్థరాత్రి ఒంటినిండా నగలతో ఓ ఆడపిల్ల నీలారీ ఎక్కితే.." ఆయన మాట పూర్తి కాకుండానే....

"జరగని వాటి గురించి తల్చుకోవడం ఎందుగ్గురూ!" అన్నాడు నాగులు నిస్పృహగా.

"జరక్కపోవడం ఏంటయ్యా! ఇప్పుడు జరిగిందదేగా! ఇదిగో ఈవిడ మా ఆవిడ. వద్దంటున్నా వినకుండా కిలోల కొద్దీ బంగారు నగలు తగిలించుకు బయల్దేరింది. నువ్వు కాబట్టి కానీ, మరొకళ్లయితే మమ్మల్ని క్షేమంగా గమ్యం చేర్చేవారా? అందుకు మేమిద్దరం నీకు థ్యాంక్స్ చెప్పుకోవాలి" అన్నారు శ్రీవారు ఉత్సాహంగా.

అతను భళ్లున నవ్వాడు. ఆ నవ్వుకి మేమే కాదు దారిన పోతున్నవారు సైతం తృళ్లిపడ్డారు.

"ఎందుకు నవ్వావ్?' విస్తుపోతూ అన్నారు శ్రీవారు.


"లేకపోతే ఏంటి గురూ! ఆడోల్ల గురించి నాకు కొత్తగా సెప్తావా? అన్ని రకాలాడోల్లు నాకు తెలుసు. నువ్వెన్ని కతలు సెప్పినా నమ్మను. అయినా ఓ బక్కసిక్కిన మొగోడికి ఆడేసం కట్టి, ఒంటినిండా గిల్టు నగలెట్టి, అర్ధరేత్రి నాలారీ ఎక్కింటేత్తే, ఓ లమ్మో! అదురుట్టం పండిపోనాదని, ఎంటపడే ఎర్రెదవలా కనిపిస్తున్నానా?" మళ్లీ నవ్వాడు నాగులు.

మేం కొయ్యబారిపోయాం. మేం తేరుకునేలోగానే..

"సరేగానీ గురూ! ఎలాంటేసాలకైనా, ఎగిరి గంతేసొచ్చే లడ్డుల్లాంటి ఆడపిల్లలు దొరుకుతుంటే, నువ్వేంటి పొగసూరు కట్టెలా వున్న ఈ గురుడ్ని పట్టావ్....సర్లే ఈ పాలికిలా కానిచ్చెయి! ఈసారి డ్రామా ఏస్తే మాత్రం నా కాడికిరా! సినిమా యాక్ట్రల్లాంటివ్మాయిల్ని సూపిస్తా" అంటూ సమాధానం కోసం చూడకుండా, లారీ ఎక్కి చప్పుడు చేసుకుంటూ వెళ్లిపోయాడు నాగులు.

విషయం పూర్తిగా అర్థమైన మాకు స్పృహ తప్పుతున్నట్టనిపించింది. అంటే వాడు నిజంగా పెద్ద గూండానే. నన్ను చూసి మగాడనుకుని, నా నగల్ని నా జడలాగే ఆర్టిఫీషియల్‌వి అనుకునీ మమ్మల్ని క్షేమంగా గమ్యానికి చేర్చాడు. నా వేషం పగటి వేషగాడి వేషంలా వుంది కాబట్టే సరదాగానన్నాట పట్టించాడు. ఒక్కసారిగా నీరసం ఆవహించేసింది. వాడలా అనుకోకపోతే ఏం జరిగేదో వూహించుకుంటే ముచ్చెమటలు పోశాయి. వాడలా అనుకొని వదిలేసినందుకు ఆనందించాలో, పొగచూరు కట్టె లాంటి మగాణ్ని వర్ణించినందుకు బాధపడాలో అర్థం కాక నిల్చున్నచోటే కుప్పకూలిపోయాను.

★



# అతి పెద్ద బ్రా హారం

ప్రపంచ రికార్డ్ కోసం క్వీన్స్ ల్యాండ్‌లోని బుండాబెర్గ్ స్త్రీలంతా తమ పాత బ్రాలను దానం చేస్తున్నారు. **200,000** బ్రాలను సేకరించి ప్రపంచంలోనే అతి పెద్ద అండర్ వేర్ చైన్ తయారు చేయాలని అక్కడి స్త్రీలు భావిస్తున్నారు. గత వారంలో ట్రయిల్ రన్ జరిగింది. బ్రెస్ట్ క్యాన్సర్ నర్సుల సహాయార్థం మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌కు బాసటగా నిలిచేందుకు స్త్రీలంతా ఇలా ఉద్యమిస్తున్నారు. ఈ రూపేణా సహాయ నిధిని సేకరించేందుకు ముందడుగు వేస్తున్నారు. ఇప్పటి వరకు **111** కిలోమీటర్ల బ్రా హారమే ప్రపంచ రికార్డు కాగా, ఆ రికార్డును అధిగమిస్తామని అంటున్నారు.హుక్స్‌తో ఒకదానికి ఒకటి కలుపుకుంటూ హారం చేయడమే ప్రధానమని, ఇప్పటి వరకు **1,50,000** బ్రాలను సేకరించగలిగామని, మిగిలిన **50,000** బ్రాలను అతి త్వరలోనే సేకరించి హారాన్ని రూపొందించడంలో ముందుంటాం అని వారు తమ ధీమా వ్యక్తం చేస్తున్నారున. బుండాబెర్గ్ ఆసుపత్రిలో బ్రెస్ట్ క్యాన్సర్‌తో బాధపడుతోన్న ఓ నర్సును చూసి, అక్కడి స్త్రీలంతా ఇలా స్పందించినట్టుగా అంతా చెబుతున్నారు.